క్లుప్తంగా

బాబా మందిరంలో విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఉదయం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం జరిగింది.

బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సుందరయ్య యాదవ్

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎం.సుందరయ్య యాదవ్ ఎన్నికయ్యారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉమామహేశ్వర్‌తోపాటు మరో 12 మంది కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుందరయ్యయాదవ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనను అభినందించారు.

నేటి నుంచి అఖండ వేదపారాయణ సప్తాహం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పొగతోట గాంధీనగర్ చక్రాలవారి ట్రస్ట్ శ్రీ ఆదిశంకర ధ్యానమందిరంలో శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు అఖండ వేదపారాయణ సప్తాహం జరుగుతుందని మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, అధ్యక్షుడు పారాగురు వెంకటశ్రీధరశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధీశ్వరులు జగద్గురు విద్యారణ్య భారతిస్వామి మంగళాశాసనాలతో కార్యక్రమం జరగనుందని తెలిపారు. రోజూ ఉదయం 8.30, సాయంత్రం 3.30 గంటల నుంచి ప్రఖ్యాత వేదపండితులతో సంపూర్ణ వేదపారాయణం ఉంటుందని తెలిపారు. అలాగే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు కూడా ఉంటాయన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. తడికలబజారుకు చెందిన లెనిన్, నాగమాధురి (23) దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడాది క్రితం దంపతులు విడిపోయారు. అప్పటి నుంచి నాగమాధురి తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటోంది. కొంతకాలంగా ఆమె మతిస్థిమితం సరిగ్గా లేక బాధపడుతోంది. అప్పుడప్పుడు ఇంట్లోంచి బయటకు వెళ్లి నాలుగు రోజుల తర్వాత తిరిగి వచ్చేది. ఈక్రమంలో ఈనెల 11వ తేదీన ఆమె గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 16వ తేదీ రాత్రి మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి కుటుంబసభ్యులు గురువారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పులి వాహనంపై పోలేరమ్మ తల్లి

సంగం: మండలంలోని సిద్దీపురంలో ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయంలో జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు పులి వాహనంపై అమ్మవారు దర్శనమిచ్చారు. తొలుత ఆలయంలోని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పులి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం విశేష పూలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రాక్టర్‌పై పోలేరమ్మ తల్లిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఇళ్ల ముంగిటకు వచ్చిన అమ్మవారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు.

ఆహ్వానపత్రికల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరుగనున్న శ్రావణమాస మహోత్సవాల ఆహ్వానపత్రికల ఆవిష్కరణ గురువారం జరిగిందని ధర్మకర్తల మండలి చైర్మన్ ఆర్.శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి బొగ్గల మల్లికార్జునరెడ్డి తెలిపారు. నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సూచనల మేరకు మినీబైపాస్‌రోడ్డులోని ఆదాల కార్యాలయంలో రంగారెడ్డి ఆవిష్కరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు హరిబాబు యాదవ్, నూనెమల్లికార్జున యాదవ్, పవన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి, మేఘనాథ్‌సింగ్, మురళి, శివారెడ్డి, దేవస్థానం పాలక మండలి సభ్యులు పి.రాములమ్మ, కె.పెంచలమ్మ, 41వ డివిజన్ నాయకులు కొవ్వాకొల్లు బాబ్జీ, ఎస్.సురేష్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- సీఎం వైఎస్ జగన్ పాలన దేశానికి ఆదర్శం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోంది. ఎవరికీ సాధ్యం కాని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శం.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెముడుగుంటలో ఉన్న ఫ్రెండ్స్ కల్యాణ మండపంలో గురువారం జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నమోదు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన, చంద్రబాబు హయాంలో ప్రజలకు చేసిన మోసాలు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన గురించి వివరించారు. బటన్ నొక్కితేనే సరిపోతుందా అంటూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేస్తున్న దుష్ప్రచారాలను ఏవిధంగా తిప్పికొట్టాలో తెలిపారు. వైఎస్సార్ అన్ని వర్గాలకు మేలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలను విధాలా మోసం చేసి వారి ఆగ్రహానికి గురయ్యాడని కాకాణి అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాలికొదిలి దోచుకోవడం, దాచుకోవడంపైనే దృష్టి పెట్టాడని విమర్శించారు. చివర్లో పసుపు – కుంకుమ పేరుతో మహిళలకు రూ.10 వేలిచ్చి మోసం చేయాలని చూస్తే ప్రజలు 2019 ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పారని గుర్తుచేశారు.

మొదటి సంవత్సరం నుంచే..

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్నట్లు మంత్రి కాకాణి చెప్పారు. ఆయన మాటలు నమ్మిన ప్రజలు 2019 ఎన్నికల్లో మద్దతుగా నిలిచినట్లు తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలను ఒకేసారి అమలు చేయడం సాధ్యం కాదని ఏడాదికి ఒక్కో పథకం అమలు చేయాలని కొందరు సూచించినా ప్రజల కోసం పథకాలను మొదటి సంవత్సరం నుంచి అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. దేశ చరిత్రలో ఎక్కడాలేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు.

బాబు విమర్శలు సిగ్గుచేటు

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాకాణి మండిపడ్డారు. బటన్ నొక్కి పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నాడని విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర అవసరాల కోసం చేయాల్సిన అప్పుల్లో 70 శాతం మాత్రమే తీసుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత జగనన్న సచివాలయ కన్వీనర్, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, నాయకులు కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, తెనాలి నిర్మలమ్మ, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, చిట్టమూరు అజయ్‌కుమార్‌రెడ్డి, ఉప్పల శంకరయ్యగౌడ్, కోనం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

ప్రజాభిమానమే నన్ను నడిపిస్తోంది



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'గడప గడపకు మన ప్రభుత్వం గొప్ప కార్యక్రమం. ఇందులో భాగంగా నియోజకవర్గంలో 1.07 లక్షల గడపలు తిరగాల్సి ఉంది. ఇది సాధ్యమేనా అనే అనుమానం తొలుత నాలో ఉండేది. కార్యక్రమం మొదలయ్యాక ప్రతి గడపలో ప్రజలు నాపై ఎంతో అభిమానం చూపించారు. దీంతో సునాయసంగా 93 వేలకు పైగా ఇళ్లకు వెళ్లగలిగా.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం కోవూరు సచివాలయం–1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల అభిమానంతోనే 79 సచివాలయాల పరిధిలో 93,800 గడపలు తిరిగినట్లు తెలిపారు. ఇదే ఉత్సాహంతో మిగిలిన ఇళ్లు కూడా పూర్తి చేస్తానన్నారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకున్న పరిస్థితి ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. ప్రతి కుటుంబం బాగోగులు ఎమ్మెల్యేలు చూడాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

అర్హులందరికీ..

రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని ప్రసన్న అన్నారు. గతంలో ఇతర పార్టీల వారికి ఎలాంటి పనులు చేయొద్దని అధికారులను ఆదేశించిన నాయకులూ ఉన్నారన్నారు. ప్రతిపక్షాల వారికి ఒక్క పథకమూ అందనిచ్చేవారు కాదన్నారు. నేడు పారదర్శకంగా జరుగుతున్న సంక్షేమ పథకాల అమలు విధానంతోనే జగన్‌మోహన్‌రెడ్డి మనసు ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ తమ ఇంటి బిడ్డగా ఆదరిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. వారందరికీ ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ప్రతిష్టను మరింత పెంచుతున్న వలంటీర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీసీఎంబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జ్యోత్స్న, వేణుగోపాల్, కోవూరు, గంగవరం సర్పంచ్‌లు విజయ, లక్ష్మీకుమారి, అనుబంధ సంఘాల నాయకులు అనూప్‌కుమార్‌రెడ్డి, చిరంజీవి, వెంకటరమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, శ్రీధర్, విజయకుమార్, రవికుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జొన్నవాడలో ప్రత్యేక పూజలు



జొన్నవాడలో ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నేటి నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే ఈనెల 25వ తేదీన ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసంగా ఇప్పటికే ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు ఆలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వరలక్ష్మీవ్రతంలో పాల్గొనాలనుకునే మహిళా భక్తులు ముందుగానే టికెట్‌ను బుక్ చేసుకుంటే వారికి ఉచితంగా పూజా సామగ్రిని ఇవ్వనున్నారు.

వసతుల కల్పించాం



శ్రావణమాసం ప్రారంభం కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు అవసరమైన తాగునీరు, భోజనం, క్యూలైన్లు, గదులు, మరుగుదొడ్లు తదితర వసతులను కల్పించాం. అలాగే సామూహిక వరలక్ష్మీవ్రతానికి సంబంధించి అన్ని ఏర్పాటు పూర్తి చేశాం.

– పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, జొన్నవాడ ఆలయ చైర్మన్

ముమ్మరంగా కొత్త ఓటర్ల నమోదు



కొత్త ఓటర్లను నమోదు చేస్తున్న బీఎల్వో

మనుబోలు: మండల కేంద్రంలో కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. గురువారం బీఎల్వోలు (బూత్ లెవల్ ఆఫీసర్స్) ఓటర్ల జాబితాతో ఇంటింటికీ వెళ్లి రేషన్, ఆధార్‌కార్డుల ఆధారంగా ఒక కుటుంబంలోని వారు ఒకే వార్డులో ఉండేలా మార్పులు చేర్పులు చేస్తున్నారు. దీంతో పాటు కొత్తగా ఓటు హక్కు పొందిన వారిని జాబితాలో నమోదు చేస్తున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని బీఎల్వోలు సూచించారు.

వార్డుల్లో ప్రచారం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మనుబోలు: మండలంలోని మనుబోలు, మడమనూరు, బండేపల్లి గ్రామాల్లో మూడు వార్డులకు ఈనెల 19వ తేదీన ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మనుబోలు 4వ వార్డు, చెర్లోపల్లి 8, మడమనూరు 7, బండేపల్లి 3వ వార్డులకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. చెర్లోపల్లిలో నామినేషన్ వేసిన ఇద్దరిలో ఒకరు ఉపసంహరించుకోవడంతో ఏకగ్రీవమైంది. మిగిలిన మూడు వార్డుల్లో ఏడుగురు బరిలో నిలిచారు. మనుబోలు 4వ వార్డు అభ్యర్థులైన పరిమళ ఆదిలక్ష్మి, చింతల శేషమ్మ ప్రచారం చేస్తున్నారు. ఆదిలక్ష్మికి మద్దతుగా గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు.

మూడు రోజులు.. 25 వేల సెల్ఫీలు



సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ నెల్లూరులోని ఎంజీబీ మాల్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ ఇండియా సెల్ఫీ బూత్‌కు విశేష స్పందన లభించిందని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు మూడురోజులపాటు ఏర్పాటు చేసిన ఈ సెల్ఫీ బూత్‌లో దాదాపు 25 వేల మంది సెల్ఫీలు తీసుకున్నారన్నారు. డిజిటల్ ఇండియాపై యువతకు అవగాహన కల్పించేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సెల్ఫీబూత్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, ఆవాస్ యోజన, వ్యాక్సిన్ డ్రైవ్, జలశక్తి అభియాన్ లాంటి కార్యక్రమాల పట్ల యువతకు అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వం ఈ స్టాల్స్ ఏర్పాటు చేసిందన్నారు.

డీఆర్‌డీఏ పీడీ విచారణ



మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి

సంగం: మండలంలోని మర్రిపాడు గ్రామంలో ఓ బ్యాంక్ కరస్పాండెంట్ పొదుపు నగదు స్వాహా చేసిన ఘటనపై డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి గురువారం సంగంలో విచారణ చేపట్టారు. స్థానిక బ్యాంక్‌లో మేనేజర్‌తో మాట్లాడారు. అనంతరం పొదుపు సభ్యులను కూడా విచారించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బ్యాంక్ కరస్పాండెంట్ షాజహాన్ తప్పు చేసింది వాస్తవమేనని, ఆ నగదును తిరిగి చెల్లిస్తానని తెలిపినట్లు చెప్పారు. ముందు పొదుపు నగదు రికవరీ చేసే పని చేపడుతున్నామని, అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి వెంట పొదుపు ఏపీఎం విజయలక్ష్మి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: రోడ్డు దాటుతున్న మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి బైక్‌పై గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని ఆటో వెనుక నుంచి ఢీకొనడంతో నరసింహులుకు గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆయన్ను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోరు ఏర్పాటు



పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామ శ్మశానంలో బోరు నిర్మాణం చేపట్టారు. పంచాయతీ నిధులు, దాతల సహకారంతో మరుపూరు శ్మశానవాటికలో పనులు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ నిధులతో బోరు నిర్మాణం చేసినట్లు వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు.

980 పక్కాగృహాల నిర్మాణాలు పూర్తి



మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ స్టీఫెన్

ముత్తుకూరు: జగనన్న కాలనీల్లో త్వరలో ఇళ్ల ప్రారంభోత్సవం చేయాల్సి ఉందని హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం అన్నారు. ఇప్పటికే 980 పక్కాగృహాలు పూర్తయ్యాయని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ స్టీఫెన్ మాట్లాడుతూ 2022 – 23 సంవత్సరంలో మండలంలో చేపల వేట చేసే పడవలకు డీజిల్‌పై ప్రభుత్వం రూ.56 లక్షల మేర సబ్సిడీ ఇచ్చిందన్నారు. మొత్తం 296 బోట్లకు డీజిల్‌ను సబ్సిడీపై సరఫరా చేసినట్లు తెలిపారు. మండలంలో 2,500 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. దీనికి ప్రభుత్వ అనుమతి ఉంటేనే విద్యుత్ బిల్లులపై సబ్సిడీ ఉంటుందన్నారు. రైతులు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ గండవరం సుగుణ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీఓ ప్రత్యూష, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మనుబోలు: మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో భౌతికశాస్త్రం స్టడీ మెటీరియల్‌ను గురువారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆ క్లబ్ సభ్యుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. సులభమైన రీతిలో సబ్జెక్ట్ అర్థం చేసుకునేందుకు స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందన్నారు. బాగా చదివి తల్లితండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 ప్రమాదాలు.. 50 ప్రాణాలు

67వ నంబర్ ముంబై జాతీయ రహదారి అంటేనే ప్రజలు, వాహనదారులు హడలిపోతున్నారు. ముఖ్యంగా నెల్లూరు నుంచి బళ్లారి వరకు ఉన్న ఈ రహదారిపై వారంలో నాలుగైదు ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అనేకమంది తీవ్రంగా గాయపడుతున్నారు. పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నా నిత్యం ఏదో ఒక ప్రాంతం నెత్తురోడుతోంది.

- వామ్మో.. ముంబై జాతీయ రహదారి
- నెత్తురోడుతున్న 67వ నంబర్ హైవే
- వారంలో నాలుగైదు ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు



ఇటీవల మఠం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: నెల్లూరు – బళ్లారి మధ్య ఉన్న 67వ ముంబై జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని, ఎందరి ప్రాణాలు గాల్లో కలుస్తాయోనని పోలీసులు ఆందోళన చెందుతున్నారు. నెల్లూరు నుంచి ఆత్మకూరు వరకు సిమెంట్ రోడ్డు ఉంది. ఎక్కువగా ప్రమాదాలు ఈ ప్రాంతంలోనే జరుగుతున్నాయి. డేంజర్ జోన్లుగా ఉన్న చోట డివైడర్లు లేకపోవడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అతివేగం కారణంగా ప్రాణాలు పోతున్నాయి.

మూడేళ్లలో..

గడిచిన మూడు సంవత్సరాల్లో ఈ జాతీయ రహదారిపై నెల్లూరు నుంచి ఆత్మకూరు పరిధిలో సుమారు 30 పెద్ద ప్రమాదాలు జరిగినట్లు అధికారుల అంచనా. 50 మంది మృతిచెందగా, మరో 100 మందికి పైగా క్షతగాత్రులుగా మిగిలారు. ముఖ్యంగా గత సంవత్సరం దామరమడుగు పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన టెంపో, లారీ ప్రమాదంలో చెన్నైకి చెందిన ఎనిమిది మంది మృత్యువాతపడగా, అందులో ఇద్దరు చిన్నారులు తండ్రిని కోల్పోయి బిక్కుబిక్కుమంటూ ఉండిపోయారు. అలాగే 2021లో సంగం మండలం దువ్వూరు వద్ద ఆటోను పాల వ్యాన్ ఢీకొనడంతో ఆరుగురు వ్యవసాయ కూలీలు మృతిచెందగా మరో నలుగురు క్షతగాత్రులుగా మిగిలారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. చాలా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

నివారణ చర్యలు తీసుకుంటున్నా..

హైవేపై ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటున్నా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా డివైడర్ లేకపోవడం ఒక కారణంగా చెబుతున్నారు. ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు భావిస్తున్నారు.



డివైడర్ లేని ముంబై జాతీయ రహదారి

డివైడర్లు ఏర్పాటు చేయాలి



నెల్లూరు నుంచి బళ్లారి వరకు ఉన్న ముంబై జాతీయ రహదారిపై ఎక్కువ భాగం డివైడర్ లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ ఉంటే ప్రమాదాలను తగ్గించేందుకు అవకాశాలున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు. నేషనల్ హైవే అధికారులు స్పందించాలి.

– రమేష్, దామరమడుగు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా



జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర మంత్రి విశ్వరూప్‌కు లేఖలు రాశాను. కలెక్టర్‌ను స్వయంగా కలిసి విన్నవించాను. త్వరలోనే కమిటీ వేసి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

– జీవీ కార్తీక, విద్యార్థిని, నాగమాంబపురం

అవగాహన కల్పిస్తున్నాం

మండలం పరిధిలోని దామరమడుగు, కాగులపాడు, మఠం గ్రామాల వద్ద ముంబై జాతీయ రహదారిపై డేంజర్ జోన్లు గుర్తించాం. ఆయా గ్రామాల్లో ఇప్పటికే దామరమడుగు, కాగులపాడు వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించాం. అయితే డివైడర్లు లేని కారణంగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– వీరప్రతాప్, ఎస్సై, బుచ్చిరెడ్డిపాళెం